# కౌగిలి నొప్పులు కవీంద్రుని మెప్పులు

అది ఇంకా రసికత చావని కాలం. శృంగారమంటే మనసుకి తనవుకి ఆరోగ్యాన్నిచ్చే సింగారంగా భావించే మంచి కాలం. అనుభవాలు తప్పుకావు కానీ తప్పుడు అనుభవాలు ముప్పు అని తెలుసుకున్న మేలికాలం. మనిషిలోని కామ ప్రవృత్తిని రాక్షసగుణాన్ని రెచ్చగొట్టే రచనలు లేని చక్కని కాలం. వర్ణన పేరుతో మనిషిలోని పైశాచికత్వానికి ప్రాణం పోయకుండా మనసువీణని మధురంగా శృతి చేసి అందమైన రాగాలను పలికించిన చక్కని కవుల కాలం.

పిఠాపురం రాజావారు కవితను పోషించారు కవులను పోషించారు. కృతి చెప్పి అంకితం ఇచ్చి ఆ మీదట తృప్తితో సంతృప్తితో కాలం గడపే వాళ్ళు కవులు. నిద్దుర్లేవగానే నిత్య జీవన భృతికి వెంపర్లాడాల్సిన గతి కవులకి కళాకారులకి ఉండేవికాదు. అందుచేత చక్కని వర్ణనలతో ఎంచక్కనైన కవిత్వాన్ని అందించే వారు. ఆ పిఠాపురానికి సమీపంలో చంద్రపాలెం అనే ఊరుంది. ఆ ఊళ్లో కూచి మంచి వారిది పండిత కుటుంబం. బాగా చదువుకోగలిగే కావ్యాలకి వాళ్ళ ఇల్లు పుట్టిల్లు, అన్న తిమ్మకవి. తమ్ముడు జగ్గకవి. ఇద్దరూ కవిత్వంలో ఉద్దండులే ! తిమ్మకవి తేనెతేటల్లా పూట నీటిలాగా మాటల మూటలు పేర్చి రసికజన మనోభిరామం వ్రాశారు. అది దేశవ్యాప్తంగా పఠన పాఠంగా ప్రచారంగా రూపొందింది.

ఆ నోటా ఆ నోటాపడి అందులో కవితా సోయగాలు ఇంపైన వర్ణనలు పసందైన భావనలు ఓవేశ్య చెవిన బడ్డాయి. ఆరోజుల్లో వేశ్యలు తరసకి వెలయాళ్లెగానీచదువుకుని భరత నాట్యాది విద్యలు అభ్యాసం చేసి వీణ మొదలైన సంగీత వాద్యాలు నేర్చి ఇంటికి వచ్చిన సరసుడైన విటుడిని ముందు మాటతో పాటతో ఆటతో బాగా సంతోషపరిచి ఆ తరువాత శారీరకానందాన్ని పంచుకునేవారు. వచ్చే విటుడైనామనస్సు శాంతపడ్డాకే తనువు శాంతపడాలని కోరేవాడు.

విద్వజ్జన రంజని అనే వెలయాలికి అవి విన్నాక ఆ గ్రంథం చదవాలనిపించి తెప్పించి చదివాక ఇంత బాగా శృంగార రసపోషణ చేసిన కవిగారు ఎంతరసికులో ఎంత అందగాడో అనుకొని ఆ కవిగార్ని చూడాలని బయలుదేరింది పిఠాపురం దాటి చంద్రపాలెం చేరుకుంది.

ఈమె వెళ్లేసరికి ఆ కవిగారు ఎలాఉన్నారు ? మధ్యాహ్నం శివార్చన చేసి ఆ మీదట కునుకు తీసి భోజనానికి అవసరమైన విస్త్రళ్లు కుట్టుకుంటున్నారు.

మధ్యాహ్నం భోజనవేళ కట్టుకున్న మడిపంచె— రోజూ తడిపి పిండి ఆరవేయడంవల్ల ధోవతి తెలుపుపోయి నీరు కావి రంగుకి వచ్చింది. మోకాళ్ళ పైకి జరిపి ఎగదీసి కట్టుకున్నాడు. మొఖాన గంధాక్షతలు. మాసిన గడ్డంతో ఒకటి అరా నెరసిన వెంట్రుకలు పిలకముడి, భుజాల మీద షష్ఠిపంచ !

ఆ రూపంలో అతన్నలా తూడగానే రంజని మనస్సు నీరు గారి పోయింది. "ఏం బాపనయ్యావయ్యా ! కవి సార్వభౌముడివని బిరుదు ఉన్నందుకైనా కాస్త హోంబట్టు పంచె సింగారించి భుజాన కాశ్మీరు శాలువా వల్లెవాటుగా వేసుకొని ముఖాన శ్రీ చందనం దిద్దుకుంటూ తాంబూలం సేవిస్తూ ? సత్కవితా గోష్ఠిలో ఉంటావనుకుంటే విస్త్రళ్ళు కుట్టుకుంటున్నావా అనుకుంది.

అయినా తమాయించుకొని సమస్కరించింది.

"కవిరాజులకు నమస్కారం !"

"శుభమస్తు ! శోభనమస్తు ! దీవించాడు తిమ్మన

"మిమ్మల్ని చూడాలని వచ్చాను"

"వచ్చి చూశావుగా !"

'మీరసిక జనమనోభిరామం—'

'చదివావా ¡'

"ఆహా ఏం పద్యం....ఏం వర్ణన"

కథా నిలయం
1591
శ్రీకాకుళం

అంటూ నాల్గైదు పద్యాలు పరవశంతో అందులోనివి చదివింది. ఈ లోగా కవిగారు విస్తరాకులు, అంటువేసే పుల్లలు, కుట్టిన విస్తళ్ళు వదిలేసి నుంచున్నారు. నడుం మీద చేయ్యేసి వింటున్నారు.

అబ్బురపడి చదివిన కవిత్వం మనసు తబ్బిబ్బయ్యే పరవశత్వం ఎదురుగా ఆజానుబాహువు - అందగాడు అయిన కవి సార్వభౌముడు - భుజాన కాశ్మీరు శాలవా బదులు గావంచ వుంటేనేం ? పట్టు పీతాంబరానికి బదులుగా పాత నీర్కావి పంచె అయితేనేం ? ముఖాన కస్తూరి తిలకం బదులు గంధాక్షతలుంటేనేం ? మెడలో రత్న హారాల బదులు జంద్యప్పోగుంటే ఏం ? ఆ నాటి వరూధిని ప్రవరుడ్ని చూచి ముచ్చట పడినట్లుగా ముచ్చట పడిపోయి ఆగలేక కవిరాజును కౌగిలించుకుంది.

వచ్చినప్పటి నుంచి చూస్తున్నాడు వాలకం. కాస్తంత వెర్రి యింకాస్తంత పైత్యం వున్నట్టు అర్థం అవనే అయ్యింది. ఇదిగో ఇప్పుడు కౌగిలింత—

చప్పున ముఖం తిప్పుకున్నాడు. కవి సార్వభౌముడు. ఊసురుమనిండి రంజిని ఊసురు మన్న మనస్సు కస్సుమంది. కవిత్వంగా చతురులలోన నెంతయును జాణసటంచును, నెంతయును నేను గౌగిలించితి, ఇటు మారుమోమిడగ చెల్లునెయో రసికాగ్రగణ్య !"

ఏమయ్యా కవీ ! రసికుడవే ! జాణవే ! చతురులలో చతురుడవని పేరుపొందావే ! నే వచ్చి మెచ్చి యిచ్చిన కౌగిలికి నొచ్చినట్లుగా పెడమొఖం పెడతావేం ? అంది పద్యం అయ్యాక గద్యంలో.

ముసి ముసి నవ్వులు నవ్వాడు తిమ్మ కవీంద్రుడు !

అయ్యో పాపం ! వరూధినిలాగే మొఖం వేలాడేశావ్ ! ఇంతకింతకు నచ్చి వచ్చినందుకు మెచ్చి కౌగిట్లో గుచ్చినందుకు మారు మొఖమయ్యానని కోపమా ? ఇంతకు నేను అటుమొగమయ్యింది ఎందుకో తెలుసా ?

"అద్భుత మగునట్టి బంగరపు బొంగరపుంగవబోలు నీ కుచద్వితయము బొమ్మన నాటి వీపున దూసె నటంచు చూచితిన్."

"బాలా ! బేలవు కావద్దు ! బంగారు రంగారు బొంగరాల్లా అన్ని విధాలా అందగా ఉన్న నీ చనుదోయి బిరుసెక్కి పదునెక్కి నిక్కినాగుండెను దూసుకొని వెళ్ళాయి. అయినా అంతటితో ఆగకుండా వీపుగుండా వెళ్ళుకుని వచ్చాయేమోనని ఆ గుచ్చుకున్న వైఖరికి అదిరిపోయి వెనుదిరిగి చూశాను అన్నాడు.

అంతే !

"భళిరా సత్కవి సార్వభౌమ ! కూచి మంచి తిమ్మ ! నిజంగా జాణవే!" అంటూ సిగ్గులమొగ్గ అయ్యింది రంజని.

—o—